క్లుప్తంగా

25 నుంచి చౌడేశ్వరీ దేవి ఉత్సవాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరీ మాత ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 25న గణపతి పూజ, యాగశాల ప్రవేశం, 26న అమ్మవారికి జలాధివాసం, ధాన్యదివాసం, శయనాధివాసం పూజలతో పాటు 27న ఉదయం యంత్ర ప్రతిష్ఠ, 11 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

మద్యం దుకాణాల తనిఖీ



మద్యం దుకాణంలో తనిఖీ చేస్తున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి రవికుమార్ రెడ్డి

బేతంచెర్ల: నంద్యాల జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి రవికుమార్ రెడ్డి బుధవారం బేతంచెర్ల పట్టణంలోని మద్యం దుకాణాలను, ది హెవెన్ రెస్టారెంట్, బార్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. మద్యం దుకాణాల్లో బ్రాండ్లు, స్టాకు వివరాలను పరిశీలించి నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. మద్యం దుకాణాలతో పాటు బార్, రెస్టారెంట్‌లో సమయపాలన పాటించాలన్నారు. కల్తీ మద్యం గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించి, రసాయన పరీక్ష నిమిత్తం శాంపిల్స్ తీసుకున్నారు. మద్యం అమ్మకాలను పరిశీలించారు. ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ అస్లాంబేగ్, హెడ్ కానిస్టేబుల్ శివ నాగిరెడ్డి, సిబ్బంది కల్పన పాల్గొన్నారు.

పాఠశాలలో క్షుద్రపూజల కలకలం

డోన్ రూరల్: మండల పరిధిలోని దొరపల్లి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం క్షుద్రపూజల వ్యవహారం కలకలం రేపింది. పాఠశాల తలుపుల వద్ద గుర్తు తెలియని వ్యక్తులు పసుపు, కుంకుమలతో ముగ్గు గీసి, ఎముక, చిన్న పుర్రె ఉంచి క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లున్నాయి. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. క్షుద్ర పూజలు చేసిన వారిని పట్టుకుని చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆకతాయిల పనే: ఎంఈఓ, ప్రభాకర్
గ్రామంలో కొందరు ఆకతాయిలు కావాలనే క్షుద్రపూజలు చేసినట్లుగా విద్యార్థులను భయ భ్రాంతులకు గురి చేస్తున్నారు. గతంలో కూడా ఇక్కడి నీటి ట్యాంకును ధ్వంసం చేసిన సంఘటన చోటు చేసుకుంది. విద్యార్థులు ధైర్యంగా పాఠశాలకు రావాలి, క్షుద్రపూజల వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం

నేటి నుంచి మొబైల్ ఆధార్ సెంటర్లు

కొలిమిగుండ్ల: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో గురువారం నుంచి మొబైల్ ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. 19వ తేదీన కమ్మవారిపల్లె, కోటపాడు, 20న హరనుమంతుగుండం, తిమ్మనాయిన పేట, 21న కల్వటాల, నాయినపల్లె, 23న బెలుం, 24న బెలుం శింగవరంలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కొత్తగా ఆధార్ నమోదు ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు. 5–15 ఏళ్లలోపు పిల్లలకు బయోమెట్రిక్ సర్వీస్ ఉచితమన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ

బనగానపల్లెరూరల్: బనగానపల్లెలోని అవుకు మెట్ట వద్ద నెల్లూరుకు తరలించేందుకు సిద్ధంగా నూకల లోడుతో ఉన్న లారీని కర్నూలు విజిలెన్స్ ఎస్‌ఐ జయన్న, తహసీల్దార్ వెంకటరాముడు బృందం బుధవారం తనిఖీ చేశారు. సుమారు 600 ప్యాకెట్లు (300 క్వింటళ్ల) నూకల లోడుతో వెళుతున్న లారీలో పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో తనిఖీ చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. బస్తాలను కిందకు దించి ప్రతిబస్తాను తనిఖీ చేశామని మొత్తం నూకలు ఉన్నట్లు వారు తెలిపారు. సీఎస్‌డీటీ రబ్బాని, పోలీసులు జమల్, జిలాని తదితరులు ఉన్నారు.

20 నుంచి వైద్యశిబిరం

కోవెలకుంట్ల: ఈనెల 20,21,22 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సీఎస్‌ఐ డయాసిస్ ఆఫ్ నంద్యాలసీఎస్‌ఐ సెయింట్ వెర్‌బర్గ్స్ మిషన్ వైద్యశాలలో ఒపేము డ్రీమ్ టీం, ప్రాక్ కొరియా బృందం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నంద్యాల డయాసిస్ మెడికల్ కమిటీ మెంబర్ శ్రీరాముల అబ్రహం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రోగాలతో బాధపడేవారు వైద్య శిబిరానికి హాజరై చికిత్స, మందులను పొందవచ్చన్నారు.

తెలకపల్లి నరసింహయ్యకు నివాళి

బేతంచెర్ల: కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ తెలకపల్లి నరసింహయ్య అని సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, షేబ అన్నారు. బుధవారం స్థానిక లారీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో తెలకపల్లి నరసింహయ్య వర్ధంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాళలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాటాలు చేసి ప్రజా నాయకుడిగా, ఉద్యమ నేతగా నరసింహయ్య నిలిచిపోయారన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు సంజీవనాయుడు, గుల్జార్, నాగేంద్రమ్మ, కలాం, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో బేతంచెర్ల

- మంత్రి చొరవతో అభివృద్ధి పరుగులు
- కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వల ఏర్పాటు
- నాలుగు లైన్ల రహదారి మార్పుతో ట్రాఫిక్ సమస్యకు చెక్
- ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యలకు పరిష్కారం



కోటపేటలో శేషారెడ్డి మోడల్ సంత మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి (ఫైల్),



ఎన్జీఓ కాలనీలో ఆహ్లాదకరంగా పార్కు

బేతంచెర్ల: 30 సంవత్సరాలుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకొని బేతంచెర్ల పట్టణంలో వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. ఎన్నో ఎళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైన పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో పూర్తికావడంతో పట్టణ రూపు రేఖలే మారిపోతున్నాయి. 1928లో సమితి బోర్డు మొదలుకొని గ్రామ పంచాయతీ, మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న బేతంచెర్ల 2020 జనవరి 20వ తేదీన నగర పంచాయతీగా రూపుదిద్దుకుంది. దీనికి తోడు పారిశ్రామిక కేంద్రమైన బేతంచెర్ల పట్టణంలో 16 సంవత్సరాల నుంచి ట్రాఫిక్ సమస్య ఉంది. పట్టణంలో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకొని బనగానపల్లె రైల్వే గేటు నుంచి సంజీవ నగర్, హనుమాన్ నగర్ కాలనీ, సరస్వతి విద్యామందిర్, సబ్ రిజిస్ట్రార్ కాలనీల మీదుగా నంద్యాల క్రాస్ రోడ్డు వరకు, బైటిపేట కల్లాల సందు నుంచి కొలుముల పల్లె రహదారిలోని చౌడేశ్వరి మాత ఆలయం వరకు రూ. 6 కోట్లతో డబుల్ రోడ్డు పూర్తి చేయడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక శాఖ మంత్రి



కొనసాగుతున్న ఆర్టీసీ బస్టాండు ఆధునికీకరణ పనులు

బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోపు డబుల్ రోడ్డు మంజూరు చేయించడమే గాకుండా పనులు పూర్తి చేయడంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడంతో పాటు పట్టణ ప్రజల కల నెరవేరింది.

30 పడకల ఆస్పత్రిగా శేషారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పట్టణ,మండల ప్రజలను దృష్టిలో ఉంచుకొని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు శేషారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. దీనికి తోడు రూ.2.29 కోట్లతో సీహెచ్‌సీ ఆధునికీకరణతో పాటు డైనింగ్ హాల్, మార్చురీ గది, ఆపరేషన్ థియేటర్, మౌలిక సదుపాయాలు కల్పించారు. వైద్యుల నియామకంతో పాటు నాణ్యమైన వైద్య సేవలు ప్రజలకు అందుతున్నాయి. అలాగే నగర పంచాయతీ పరిధిలోని బుగ్గానిపల్లె, ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ సమీపాన, అల్లబకాష్ దర్గా వద్ద 3 చోట్ల వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల పనులు రూ. 2.40 కోట్లతో కొనసాగుతున్నాయి. నగర పంచాయతీ పరిధిలో సుమారు రూ.5 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలను నిర్మించారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేల ఏర్పాటుతో పట్టణంలోని ఆయా కాలనీల రూపురేఖలు మారిపోయాయి. డ్రైవర్స్ కాలనీ, సుబ్బారెడ్డి నగర్‌లో గ్రావెల్ రోడ్లు ఏర్పాటు చేశారు. నగర పంచాయతీ పరిధిలో బుగ్గానిపల్లె నుంచి బేతంచెర్ల వరకు నాలుగు లైన్ల రహదారి పూర్తి కాగా, ప్రస్తుతం కర్నూలు రహదారిలోని అయ్యల చెర్వు నుంచి పట్టణం మీదుగా బనగానపల్లె రహదారిలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయం వరకు నాలుగు లైన్ల రహదారికి రూ.19.20 కోట్ల నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభమయ్యాయి. పట్టణం చుట్టూ నాలుగు లైన్ల రోడ్లతో పాటు (సెంట్రల్ లైటింగ్ సిస్టమ్) విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఆర్టీసీ బస్టాండు ఆధునికీకరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.

నెరవేరిన రైతుల కళ

కోటపేట మోడల్ సంత మార్కెట్ రూ.60 లక్షలతో నిర్మించగా మంత్రి బుగ్గన చేతులమీదుగా ప్రారంభించారు. ఎన్జీఓస్ కాలనీలో రూ. 35 లక్షలతో పార్కు సకల వసతులతో రూపుదిద్దుకుని పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచుతోంది. శ్రీనగర్ కాలనీలో రూ.18 లక్షలతో రైతుబజార్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. దుర్గాపేట కాలనీలో రూ.69.62 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వల పనుల పూర్తయ్యాయి.

గతుకుల రహదారికి మోక్షం



గతంలో సంజీవ నగర్, హనుమాన్ నగర్ కాలనీల ప్రజలు పట్టణంలోకి వచ్చేందుకు సరైన రహదారి లేక ఇబ్బందులు పడేవారు. ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. రెండు కాలనీల మీదుగా డబుల్ రోడ్డు పనులు పూర్తి కావడంతో గతుకుల రహదారికి మోక్షం లభించింది. అలాగే బైటిపేట కళ్లాల సందులో రోడ్డు వేయడంతో ఆయా గ్రామాల ప్రజలకు సౌకర్యంగా మారింది.

– ఖాజా హుసేన్, బేతంచెర్ల

హామీలన్నీ అమలు చేస్తున్నారు



ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అమలు చేసి చూపిస్తున్నారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యత కల్పించడమే గాకుండా సుమారు రూ.330 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి తాగునీటి పథకం పనులు ప్రారంభించారు. దశల వారీగా కాలనీల్లో డ్రైనేజీ కాల్వలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు. రానున్న రోజుల్లో బేతంచెర్ల రూపురేఖలు మారిపోనున్నాయి.

– చలం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్

శాశ్వత పరిష్కారం చూపుతున్నారు



రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఎప్పుడూ లేని విధంగా బేతంచెర్ల పట్టణంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఆయా కాలనీలు ఆకర్షణీయంగా మారిపోతున్నాయి. ప్రధాన రహదారి వెంట నాలుగు లైన్ల రహదారి ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య పరిష్కారం కానుంది. 30 ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలు సైతం పరిష్కారమవుతున్నాయి.

– మురళీ కృష్ణ, బేతంచెర్ల పట్టణం

మానసిక ప్రశాంతతతో ఆరోగ్యం

బేతంచెర్ల: ప్రతిఒక్కరూ మానసిక ప్రశాంతతతో ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చని ప్రజాపిత బ్రహ్మకుమారి మాధవి అన్నారు. బుధవారం స్థానిక ఓం శాంతి నిలయంలో ప్రజాపిత బ్రహ్మబాబా స్మృతి దినోత్సవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓం శాంతి సభ్యులు బ్రహ్మబాబాకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ మానవుడి దైనందిన జీవితంలో మానసిక ఒత్తిడి లేకుండా మెడిటేషన్‌తో పాటు విలువలతో కూడిన జీవన విధానం కోసం ఓం శాంతి నిలయాన్ని సందర్శించాలన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు కృషి

కొలిమిగుండ్ల: ప్రజా సంఘాలతో పాటు అందరి సహకారంతో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి ట్రస్ట్ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం కొలిమిగుండ్లలోని ట్రస్ట్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన ప్రజా సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జమ్ములమడుగు జంక్షన్‌లో ఏప్రిల్ 14 లోపు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజా సంఘాల నాయకులు, మేధావులు సలహాలు ఇవ్వాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజా సంఘాల నాయకులు పిడతల కంబగిరి, మద్దిలేటి, దస్తగిరి, గూటం కంబయ్య, నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సహకారంతో 3 నెలల పాటు ఇచ్చే ఉచిత జనరల్ డ్యూటీ నర్సింగ్ సహాయకుల శిక్షణకు యువతులు దరఖాస్తు చేసుకోవాలని సెంటర్ కో–ఆర్డినేటర్ బంగీ శిరీష బుధవారం తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయసున్న యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తైన తర్వాత ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 95158 17175, 70328 54540 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పశువ్యాధి నిర్ధారణ కేంద్రానికి మోక్షం



పనులు పూర్తయిన పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల భవనం

బనగానపల్లె: శిథిలావస్థలో ఉన్న పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో అభివృద్ధి చేసినట్లు మండల ఏఈ రమణ తెలిపారు. 2015 డిసెంబరులో రూ.13 లక్షల నాబార్డు నిధులతో ప్రయోగ శాలను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రయోగశాల ఉపయోగంలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరింది. పలువురు రైతుల విన్నపం మేరకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తీసుకున్న చర్యల వల్ల ప్రయోగశాల అభివృద్ధికి రూ.5 లక్షల జెడ్పీ నిధులు మంజురయ్యాయి. ఈ నిధులతో ప్రయోగశాలను అభివృద్ధి చేశారు. ఈ నెల చివరి నాటికి ప్రయోగశాలను ప్రారంభించి సేవలందించనున్నట్లు ఏడీఏ మారుతిసకారామ్ వెల్లడించారు.

రస్తా ఏర్పాటు చేయాలని వినతి

డోన్ టౌన్: దొరపల్లె గ్రామానికి పూర్వం బ్రిటీష్ కాలంలో ఏర్పాటు చేసిన 70 అడుగుల రస్తాను పునరుద్ధరించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యుడు ధర్మారం రంగనాయకులు కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో డీఆర్‌ఓ పుల్లయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి నుంచి దొరపల్లె గ్రామానికి 70 అడుగుల విస్తీర్ణం రోడ్డు ఉండేదని, ఆక్రమణలు తొలగించి రోడ్డును పునరుద్ధరించాలని కోరారు

ఆడపిల్లల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు

అవుకు: ఈనెల 24న జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో ఆడపిల్లల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ ఉమా మహేశ్వరమ్మ బుధవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. గురువారం బాలల లింగ నిష్పత్తి, సంరక్షణ, బాలికల్లో నైపుణ్యాభివృద్ధి ప్రాముఖ్యతపై మహిళలతో సభ, గర్భిణులు, కొత్తగా వివాహమైన దంపతుల గృహాలను సందర్శించి ఆడపిల్లల ప్రాముఖ్యతపై అవగాహన, 20వ తేదీన పాఠశాలల్లో క్రీడలు, వివిధ పోటీలు, 23న బాల్య వివాహాలను నిర్మూలించే దిశగా కమ్యూనిటీ నాయకులతో బీబీబీపీ సెన్సిటైజేషన్ కార్యక్రమం, టాక్ షోలు, హెల్త్ అండ్ న్యూట్రీషియన్, లీగల్ పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్, ఎంటీపీ యాక్ట్, ఇతర మహిళా సంబంధిత చట్టాల గురించి వివరిస్తారని చెప్పారు. 24వ తేదీన అన్ని గ్రామ సచివాలయాల్లో లేదా అంగన్‌వాడీ కేంద్రాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు.

పల్లెలకు స్వచ్ఛమైన తాగునీరు



తాడిపత్రిలో నిర్మాణంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్

కొలిమిగుండ్ల: పల్లె వాసుల తాగునీటి కష్టాలకు త్వరలోనే తెరపడనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపడుతున్న జలజీవన్ మిషన్ పథకం పనులు గ్రామాల్లో చురుగ్గా సాగుతున్నాయి. 2024 నాటికి ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొలిమిగుండ్ల మండలంలో రెండు విడతల్లో రూ.11 కోట్లకు పైగానే నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే మీర్జాపురం,కొండమీదపల్లె, చింతలాయిపల్లె, కమ్మవారిపల్లె, నాగిశెట్టిపల్లె, బితాడిపత్రి, బిఉప్పలూరు గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలోనే పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. జనాభా అధికంగా ఉన్న కొలిమిగుండ్ల, బెలుం, పెట్నికోట, అంకిరెడ్డిపల్లె తదితర గ్రామాలకు అదనంగా ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మండలంలోని పలు గ్రామాలకు ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు అదనంగా పైపులైన్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారు. మండలంలో ఎక్కడా తాగునీటి సమస్య ఉత్పన్నం కాకూడదనే ఉద్దేశంతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కృషి చేశారు. గ్రామాల ఆవిర్భావం నుంచి ఓవర్‌హెడ్ ట్యాంకులు లేని చోట సైతం మంజూరు చేయించారు.

ఉపాధి కూలీలకు గరిష్ట వేతనం అందాలి



జోళదరాశి వద్ద ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ రామచంద్రారెడ్డి

కోవెలకుంట్ల: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ప్రతి కూలీకి గరిష్ఠ వేతనం అందేలా పనులు కల్పించాలని పీడీ రామచంద్రారెడ్డి సూచించారు. బుధవారం కోవెలకుంట్ల మండలం జోళదరాశి, గుళ్లదూర్తి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కూలీలకు రోజుకు రూ.257 వేతనం అందించేలా చర్యలు తీసుకుందన్నారు. ఆ దిశగా అధికారులు, ఉపాధి సిబ్బంది పనులు కల్పించాలన్నారు. వ్యవసాయ పనులు ముగుస్తున్న దృష్ట్యా అడిగిన ప్రతి కుటుంబానికి ఉపాధి పనులు చూపించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. వేసవి కాలం సమీపిస్తున్న దృష్ట్యా పనులు చేపట్టే ప్రదేశంలో నీడ, తాగునీరు, తదితర వసతులు కల్పించాలని ఆదేశించారు. ఈ ఏడాది మార్చి నెలాఖరులోపు 2022–23 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన పనిదినాలు పూర్తి చేసేలా దృష్టి సారించాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా గ్రామాల్లో రైతులు, ప్రజలకు అవసరమయ్యే పనులు గుర్తించామన్నారు. ఉపాధి పథకంలో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా ప్రత్యేక యాప్ ద్వారా హాజరు, పని వివరాలు నమోదు చేస్తున్నామన్నారు. సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీడీ సాంబశివరావు, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఏపీఓ శ్రీవిద్య, జేఈ మగ్బుల్, ఉపాధి పథకం టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఓహెచ్ఎస్ఆర్ పనుల తనిఖీ



ఎన్జీఓ కాలనీలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

బనగానపల్లె: పట్టణంలోని ఎన్జీవో కాలనీ, రవ్వల కొండపై నిర్మాణంలో ఉన్న ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల నిర్మాణ పనులను విజిలెన్స్ డీఈఈ రమేష్ కుమార్ రెడ్డి, ఏఈలు శివకుమార్, జయదీప్ రెడ్డి బుధవారం పరిశీలించారు. స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఉమాకాంత్‌రెడ్డి, ఏఈ సాయికృష్ణ పాల్గొన్నారు. నిర్మాణ పనులు నాణ్యతగా ఉన్నాయని విజిలెన్స్ అధికారులు పేర్కొన్నారు.

డోన్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడి ఘనత



అవార్డు అందుకుంటున్న దృశ్యం

డోన్ టౌన్: ఈ నెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఢిల్లీ సమీపంలో జరిగిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 18వ జాతీయ జాంబురి పోటీల్లో డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెస్ట్ ఫ్యాకల్టీ రోవర్ స్కౌట్ లీడర్ చిన్నయ్య జిల్లా తరఫున పాల్గొని జాతీయ స్థాయి కలర్ పార్టీ మార్చ్ పాస్ట్ పోటీల్లో ఏ గ్రేడ్‌తో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ భారతి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా చిన్నయ్యను కళాశాలలో సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

డోన్ టౌన్: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి 2023–24 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ, రిటైల్ ధరలపై గురువారం నుంచి మూడు రోజుల పాటు విశాఖపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు డోన్ విద్యుత్ శాఖ ఈఈ ప్రసాద్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిపాదించిన ధరలపై పరిశ్రమల నిర్వాహకులు, గృహ విద్యుత్ వినియోగదారులు తమ అభిప్రాయాలను స్థానిక ఈఈ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని వెల్లడించవచ్చని పేర్కొన్నారు.

పేదల ఇళ్లలో సంక్షేమ వెలుగులు



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న సర్పంచ్, అధికారులు

ప్యాపిలి: పేద ప్రజలు ఆర్థికంగా బలోపేతం కావాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని సర్పంచ్ రంగస్వామి, ఎంపీటీసీ రామనాయుడు అన్నారు. మండల పరిధిలోని వెంగళాంపల్లె గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఈఓఆర్డీ బాలకృష్ణుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఎంపీటీసీలు మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే సచివాలయంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన ధ్రువపత్రాలు అందజేస్తే ఎవ్వరి సిఫార్సు అవసరం లేకుండా పథకాలను మంజూరు చేస్తారన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలవాలని కోరారు. వ్యవసాయ అధికారి షేక్షావలి, పీఆర్ ఏఈ ప్రభాకర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ రవికుమార్, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యే కాటసానికి వినతి



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

బనగానపల్లె: పట్టణంలోని 6వ వార్డు సభ్యులు సురేష్ ఆధ్వర్యంలో ఖాజీవాడ, నాయీ బ్రాహ్మణ కాలనీకి చెందిన ప్రజలు బుధవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని కలిసి సమస్యలు విన్నవించారు. కాలనీలో డ్రైనేజీ రహదారి సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యేకు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యలు పరిష్కారించి కాలనీవాసులకు ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

అర్హులందరికీ ఉపాధి కల్పించండి



బుగ్గానిపల్లె తాండలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న డోన్ ఏపీడీ శ్రీవిద్య

బేతంచెర్ల: గ్రామాల్లో అర్హులైన వారందరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని డోన్ ఏపీడీ శ్రీవిద్య సూచించారు. ఆమె బుధవారం మండల పరిధిలోని బుగ్గానిపల్లె తాండ గ్రామంలో జరుగుతున్న స్టాజెర్డు ట్రెంచ్ పనులను పరిశీలించారు. గ్రామంలో అందరూ ఉపాధి పనులకు హాజరు కావాలని, సగటు వేతనం రోజుకు రూ.257 పడేలా పనిచేయాలని కూలీలకు సూచించారు. ఏపీఓ శేషన్న, గ్రామస్తులు వెంకటేష్ నాయక్, మేట్‌లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



వారోత్సవాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

డోన్ రూరల్/డోన్ టౌన్: స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బుధవారం స్వచ్ఛత పక్వాడ – 2023 కార్యక్రమం, 43వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల పోస్టర్‌లను డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. డీఎస్పీ మాట్లాడుతూ..ఈనెల 18 నుంచి 24 వరకు జాతీ య రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే డోన్, ప్యాపిలి, బేతంచెర్ల పోలీస్ స్టేషన్లకు రోడ్ సేఫ్టీకి సంబంధించిన పాంప్లెట్లు,బ్రోచర్‌లు,మెటీరియల్ అందించినట్లు చెప్పా రు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలు, ఆటో డ్రైవర్లకు, విద్యా సంస్థల బస్సు డ్రైవర్లకు అవగాహన కల్పించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. వెహికల్ ఇన్సూరెన్స్ వల్ల కలిగే వాహనదారులకు ప్రయోజనాలపై బీమా సంస్థల ఉద్యోగులచే అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత, జాగ్రత్తలపై క్విజ్, ఎస్సే రైటింగ్ నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాలన్నారు. ఎంవీఐ క్రాంతి కుమార్, సీఐలు మల్లికార్జున, ప్రీతంరెడ్డి, ఎస్ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.